సాక్షి
విజయనగరం

శుక్రవారం । 30 । మే । 2025



శిథిలావస్థలో కుష్ఠు ఆస్పత్రి

ఉమ్మడి విజయనగరం, శ్రీకాకుళం జిల్లా వాసులకు సుపరిచితమైన పాగిరి లెప్రసీ ఆస్పత్రిని సమస్యలు పట్టిపీడిస్తున్నాయి. - 8లో



గురుదేవాలో చోరీపై ముమ్మరంగా దర్యాప్తు - 8లో

మంగళపాలెం గురుదేవా చారిటబుల్ ట్రస్టు ఛైర్మన్ రాపర్తి జగదీష్‌బాబు ఇంట్లో భారీ చోరీపై దర్యాప్తు సాగుతోంది.



బడ్డీకొట్టు మాయం..! - 8లో

ఓ పేద వ్యాపారి బడ్డీకొట్టుపై బడావ్యాపారి కన్ను పడింది. రాత్రికి రాత్రే చెక్క బడ్డీని అపహరించి, చెరువులో పడవేంచాడు ఆ బడా వ్యాపారి.

న్యూస్‌రీల్

నచ్చినంత తవ్వుకో.. వచ్చినంత అమ్ముకో...



రంగరాయపురంలో ఆరడుగుల లోతున ప్రభుత్వ భూమిలో మట్టి తవ్వకాలు

బొబ్బిలి రూరల్: బొబ్బిలి మండలంలో గ్రావెల్ తవ్వకాలు ఇష్టారాజ్యంగా సాగుతున్నాయి. చెరువులు, గట్లు రూపుకోల్పోతున్నాయి. 'నచ్చినంత తవ్వకో.. వచ్చినంత అమ్ముకో' అన్న రీతిన తవ్వకాలు జరుగుతున్నాయి. 'అధికార' బలంతో రంగరాయపురం, గ్రోత్‌సెంటర్, మల్లంపేట, దిబ్బగుడ్డివలస గ్రామాల్లోని చెరువులు, ప్రభుత్వ భూముల్లో రాత్రీపగలు తేడా లేకుండా కంకర తవ్వకాలు జరుగుతున్నా రెవెన్యూ, మైనింగ్ అధికారులు పట్టించుకోకపోవడం అనుమానాలకు తావిస్తోంది. ట్రాక్టర్ గ్రావెల్ రూ.1500, టిప్పర్ రూ.3వేల చొప్పున రియల్‌ఎస్టేట్ వ్యాపారులకు విక్రయిస్తున్నారు. దీని వెనుక అధికారపార్టీ పెద్దల హస్తం ఉన్నట్టు సమాచారం. తవ్వకాల్లో వారికీ వాటా వెళ్తుందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. కంకర తవ్వకాలపై అధికారులు ఉదాసీనంగా వ్యవహరించడం తగదని, కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.



మల్లమ్మపేట గ్రామ చెరువులో సాగుతున్న అక్రమ గ్రావెల్ తవ్వకాలు

దృష్టి సారించాం



అక్రమ గ్రావెల్ తవ్వకాలపై సమాచారం ఉంది. తవ్వకాలు చేపడుతున్న సమయంలో తెలియజేస్తే వాహనాలను సీజ్ చేస్తాం. రాత్రి సమయాలు, సెలవు దినాల్లో సాగుతున్న గ్రావెల్ తవ్వకాలపై దృష్టిసారించాం. కఠిన చర్యలు తీసుకుంటాం.
– మల్లపురెడ్డి శ్రీను, తహసీల్దార్, బొబ్బిలి




ఈ ఫొటోలో కనిపిస్తున్న ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం దత్తిరాజేరు మండలం కోరపు కొత్తవలస పీహెచ్‌సీ పరిధిలోని అడవి కొత్తవలసలో జరిగింది. ఇందులో విశేషం ఏమిటంటే ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం వైద్యుడి ఆధ్వర్యంలో జరగాలి. ఇక్కడ వైద్యుడు లేకుండా సిబ్బందితోనే జరిపించారు. అరకొర సేవలతో సరిపెట్టేశారు.

ఈ ఫొటోలో కనిపిస్తున్న ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం మెంటాడ మండలం చల్లపేట పీహెచ్‌సీ పరిధి పెదచామలపల్లి గ్రామంలో జరిగింది. ఇక్కడ కూడా డాక్టర్ లేకుండానే గురువారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. ఈ రెండు గ్రామాల్లోనే కాదు. అనేక చోట్ల ఇటువంటి పరిస్థితే ఉందని పల్లెప్రజలు ఆరోపిస్తున్నారు. కూటమి ప్రభుత్వం తీరును దుమ్మెత్తిపోస్తున్నారు.



- ఫ్యామిలీ డాక్టర్ వైద్యంపై కూటమి నిర్లక్ష్యం
- వైద్యులు పూర్తిస్థాయిలో ఉండడంలేదనే ఆరోపణలు
- ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు శిబిరం నిర్వహించాలి
- కొన్ని ప్రాంతాల్లో వైద్యులు లేకుండా నిర్వహణ
- మరికొన్ని ప్రాంతాల్లో మధ్యాహ్నం ఒంటిగంట, 2 గంటలకే వైద్యులు వెళ్లిపోతున్నారనే ఆరోపణలు
- గతంలో నెలకు 1.30 లక్షల మందికి సేవలు
- ఇప్పుడు 90 వేల నుంచి 1.10 లక్షల మందికే పరిమితం!



ఫ్యామిలీ డాక్టర్... ఐదేళ్ల కిందటి వరకు ధనవంతులకే పరిమితమైన వైద్యం. దానిని గత జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం పల్లె ప్రజలకు చేరువచేసింది. పీహెచ్‌సీకి ఇద్దరు వైద్యులను నియమించి పల్లెలకు పంపించింది. రోగులకు వైద్యపరీక్షలు జరిపించి అవసరమైన మందులు అందజేసేది. వ్యాధులను ప్రాథమిక దశలోనే గుర్తించడంతో త్వరగా నయమయ్యేవి. రోగులకు రూపాయి ఖర్చుకాకుండా, ఇంటి వద్దనే మెరుగైన వైద్య సేవలు, మందులు అందేవి. చాలామందికి ఆస్పత్రికి వెళ్లాల్సిన అవసరం తప్పేది. ఇంతటి ప్రాధాన్యమున్న ఫ్యామిలీ డాక్టర్ వైద్యంపై కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. వైద్యులు లేని శిబిరాలు నిర్వహిస్తూ సేవలందించడంపై జనం మండిపడుతున్నారు. సీజనల్ జ్వరాలతో సతమతమవుతున్నా వైద్యులు లేకుండానే శిబిరాలు నిర్వహిస్తున్నారని వాపోతున్నారు. వృద్ధులు, దివ్యాంగులైన రోగులను ఆస్పత్రులకు తీసుకెళ్లేందుకు ఆపసోపాలు పడుతున్నారు.

చర్యలు తీసుకుంటాం..

ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం కచ్చితంగా డాక్టర్ ఆధ్వర్యంలో నిర్వహించాలి. ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు డాక్టర్‌తో పాటు సిబ్బంది అందరూ ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో ఉండాలి. డాక్టర్ లేకుండా ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహిస్తే చర్యలు తీసుకుంటాం. కార్యక్రమం మధ్యలో వెళ్లినట్టు తెలిసినా చర్యలు తీసుకుంటాం.

ఫ్యామిలీకి.. డాక్టర్ లేని వైద్యం!



విజయనగరం ఫోర్ట్:

ఏదైనా జబ్బు చేస్తే గ్రామీణ ప్రాంత ప్రజలు మండల కేంద్రంలో ఉన్న పీహెచ్‌సీకి, లేదంటే జిల్లా కేంద్రంలో ఉన్న ఆస్పత్రికి వెళ్లాల్సి వచ్చేది. నడవలేని వారిని తీసుకెళ్లడం మరింత కష్టమయ్యేది. వ్యయప్రయాసలకు గురయ్యేవారు. ఇటువంటి వారి కష్టాలు తీర్చేలా.. పల్లె ముంగిటకే వెళ్లి వైద్య సేవలు అందించాలనే గొప్ప సంకల్పంతో గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం చేపట్టింది. గ్రామాలకు, నడవలేని వారి ఇళ్లకు వెళ్లి నిపుణులైన వైద్యులు సేవలు అందించడం వల్ల రోగుల ఆరోగ్యం కుదుటపడేది. ప్రాథమిక దశలోనే వ్యాధులు గుర్తించి సేవలు అందించడం వల్ల ఆరోగ్య సమస్యలు తగ్గేవి. ఇంతటి ప్రాధాన్యమున్న ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంపై కూటమి ప్రభుత్వం కినుక వహిస్తోందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. కార్యక్రమంపై పెద్దగా శ్రద్ధ చూపకపోవడం వల్ల లక్ష్యం నెరవేరడం లేదని పల్లె ప్రజలు వాపోతున్నారు.

ఫ్యామిలీ డాక్టర్ సేవలందించాల్సింది ఇలా...

జిల్లాలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని 104 వాహనాలతో నిర్వహిస్తున్నారు. జిల్లాలో 54 పీహెచ్‌సీల పరిధిలో 46 వాహనాలు ఉన్నాయి. ప్రతిరోజు పీహెచ్‌సీ పరిధిలో ఒక గ్రామంలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో భాగంగా సచివాలయం పరిధిలో వైఎస్సార్ విలేజ్ క్లినిక్‌లో వైద్యశిబిరం ఏర్పాటు చేస్తారు. 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు శిబిరానికి వచ్చిన రోగులను వైద్యుడు తనిఖీ చేయాలి. మిడ్‌లెవల్ హెల్త్ ప్రొవైడర్ బీపీ, సుగర్ పరీక్షలు, 104 డేటా ఎంట్రీ ఆపరేటర్ శిబిరానికి వచ్చిన రోగులకు అందించిన చికిత్స వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలి. గర్భిణులకు తనిఖీలు నిర్వహించి, బీపీ, సుగర్, హెచ్‌బీ పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులు అందజేయాలి. మధ్యాహ్నం 12 గంటల నుంచి ఒంటి గంట వరకు అంగన్‌వాడీ కేంద్రం తనిఖీ చేయాలి. ఒంటి గంటనుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు భోజన విరామ సమయం ఉంటుంది. 2 గంటల తర్వాత పాఠశాలల్లో ఉన్న విద్యార్థులను తనిఖీ చేయాలి. ఆ తర్వాత మంచానికే పరిమితమైన వారి ఇళ్లకు వెళ్లి తనిఖీలు నిర్వహించి వారికి వైద్య సేవలు అందించాలి.

వైద్యులు లేకుండా సేవలు ఎలా..?

జిల్లాలో చాలా చోట్ల డాక్టర్ లేకుండా ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని నిర్వహించడంపై ప్రజలు మండిపడుతున్నారు. కొన్నిచోట్ల వైద్యులు హాజరైనా మధ్యాహ్నం ఒంటి గంట, రెండు గంటలకే ఇంటిదారి పడుతున్నట్టు విమర్శలు వినిపిస్తున్నాయి. వైద్యులు లేకుండా నిర్వహిస్తున్న ఫ్యామిలీ డాక్టర్ శిబిరాలకు వెళ్లేందుకు రోగులు అంతగా ఆసక్తి చూపడం లేదు. మెరుగైన వైద్యసేవలు అందకపోవడంపై ఆవేదన చెందుతున్నారు. ప్రజలకు భరోసా కల్పించే వైద్యసేవలపై కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని ఆరోపిస్తున్నారు.

గతంలో సేవల పరంపర



గతంలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం ద్వారా నెలకు లక్షలాది మంది రోగులకు వైద్య సేవలు అందించేవారు. నెలకు 1.30 లక్షల నుంచి 1.40 లక్షల మంది రోగులకు సేవలందించేవారు. ఊరిలో అందే మెరుగైన వైద్యసేవలు ప్రజల ఆరోగ్య సమస్యలకు ఉపశమనం కల్పించేవి. గత కొంతకాలంగా నెలకు 90 వేల నుంచి 1.20 వేల మందికే సేవలు అందుతున్నాయి.

జంతుప్రేమ



సుమారు పన్నెండేళ్ల నుంచి అపురూపంగా పెంచుకున్న కుక్క మరణాన్ని తట్టుకోలేకపోయారు. దానిని ఖననం చేయడంతోపాటు దినకర్మ చేసి జంతుప్రేమను చాటుకున్నారు. రాజాం పట్టణ పరిధి బాబానగర్‌కు చెందిన మెహర్ ప్రసాద్, సూర్యకళ దంపతులు 2013 నుంచి ఓ కుక్కను పెంచారు. దానికి 'చాకీ' అనే పేరు పెట్టారు. కుటుంబ సభ్యులలో ఒకరిగా కలసిపోయింది. ఇంటిని కంటికి రెప్పలా కాపాడిన కుక్క అనారోగ్యానికి గురై ఐదు రోజుల కిందట మృతిచెందడంతో కన్నీరుకార్చారు. తమ పొలంలో సంప్రదాయబద్ధంగా ఖననం చేశారు. కుక్కకు గురువారం దినకర్మ నిర్వహించి అంజలి ఘటించారు. ఇరుగుపొరుగు వారికి భోజనాలు పెట్టారు.
– రాజాం సిటీ

గేటుకు బేడీలు

ఖైదీలకు వేయాల్సిన బేడీలు కొత్తవలస పోలీస్ స్టేషన్ గేటుకు వేశారు. ఈ దృశ్యాన్ని స్టేషన్‌కు వచ్చేవారు ఆసక్తిగా, ఆశ్చర్యంగా చూస్తున్నారు. బేడీలు అంటే జనంలో ఓ భయం ఉంటుంది. అలాంటి బేడీలు గేటుకు వేయడం చర్చనీయాంశంగా మారింది.
– కొత్తవలస



మూడున్నరకే మూత!

- అధ్వానంగా కొండచాకరపల్లి సచివాలయ సేవలు
- విధులకు డుమ్మాకొడుతున్న ఉద్యోగులు
- అధికారుల తీరును నిరసిస్తున్న గ్రామస్తులు



మధ్యాహ్నం మూడున్నర గంటలకే తాళం వేసిన కొండచాకరపల్లి గ్రామ సచివాలయం

వంగర: మండలంలోని కొండచాకరపల్లి గ్రామ సచివాలయ ఉద్యోగుల పని తీరును గ్రామస్తులు తప్పుపడుతున్నారు. సమయపాలన పాటించకుండా ప్రతిరోజు 3 నుంచి మూడున్నర గంటలమధ్యే సచివాలయానికి తాళం వేస్తున్నారని, సచివాలయంలో అందుబాటులో ఉండడంలేదని ఆరోపిస్తున్నారు. గురువారం కూడా మధ్యాహ్నం మూడున్నరగంటలకే సచివాలయం తలుపులకు తాళం వేసి వెళ్లిపోవడంతో వివిధ పనుల నిమిత్తం వచ్చిన కొండచాకరపల్లి, గీతనాపల్లి గ్రామాల ప్రజలు ఆవేదన చెందారు. సిబ్బందికి ఫోన్ చేసినా స్పందించలేదని కొండచాకరపల్లి గ్రామస్తులు కిమిడి చిట్టిబాబు, కొరటాన శ్రీనివాస్ తదితరులు ఆరోపించారు. గత కొన్ని నెలలుగా ఇదే తంతు జరుగుతుందని వాపోతున్నారు. ఇక్కడ సచివాలయం ద్వారా కొండచాకరపల్లితో పాటు గీతనాపల్లి పంచాయతీలకు సేవలు అందించాలి. ఇద్దరు పంచాయతీ కార్యదర్శులు, వీఏఏ, మహిళా పోలీస్, వెల్ఫేర్ అసిస్టెంట్, ఇంజినీరింగ్ అసిస్టెంట్, వీఆర్‌ఓ, జేఎల్‌ఎంలు ఉన్నా ఫలితం లేకపోతోందని గ్రామస్తులు వాపోతునారు. ఉన్నతాధికారులు స్పందించి ఉద్యోగుల సేవలపై ఆరాతీసి, చర్యలు తీసుకో వాలని కోరుతున్నారు. సచివాలయాన్ని సందర్శించి తనిఖీచేస్తామని, డుమ్మాకొడుతున్న ఉద్యోగులపై చర్యలు తీసుకుంటామని ఎంపీడీఓ రఘునాథాచారి స్పష్టంచేశారు.

సేవలు నిల్

గ్రామ సచివాలయం అంటే ఎన్నో సేవలు అందేవి. ఇప్పుడు జవాబుదారీతనం లేదు. ఉన్నతాధికారులు పర్యవేక్షణ కనిపించడం లేదు. కనీసం కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు ఇచ్చే నాథుడు కూడా లేడు. ఉద్యోగులు అందుబాటులో ఉండడం లేదు.
– కొరటాన శ్రీనివాస్, కొండచాకరపల్లి, వంగర మండలం

తప్పని నిరీక్షణ



ఉద్యోగోన్నతుల కౌన్సెలింగ్‌కు హాజరైన హెచ్‌ఎంలు

- ఉద్యోగోన్నతి కౌన్సెలింగ్‌లో సాంకేతిక ఇబ్బందులు
- ఎట్టకేలకు 47 హెచ్‌ఎం పోస్టుల కేటాయింపులు
- 69 మంది హెచ్‌ఎంలకు స్థాన చలనం
- నేడు ఎల్‌ఎఫ్‌ఎం హెచ్‌ఎంలకు కౌన్సెలింగ్
- ముగిసిన ప్రభుత్వ ఉద్యోగుల బదిలీ దరఖాస్తుల స్వీకరణ

విజయనగరం అర్బన్:

ఉమ్మడి విజయనగరం జిల్లాలో ఖాళీగా ఉన్న ప్రధానోపాధ్యాయ పోస్టులకు గురువారం స్థానిక బాబామెట్ట బాలికల ఉన్నత పాఠశాలలో నిర్వహించిన ఉద్యోగోన్నతి కౌన్సెలింగ్‌కు రాష్ట్ర స్థాయిలో సాంకేతిక ఇబ్బందులు తలెత్తాయి. సాయంత్రం వరకు అర్హులైన స్కూల్ అసిస్టెంట్ పోస్టుల కేటాయింపు ఉత్తర్వులు అందుకునేందుకు నిరీక్షించాల్సి వచ్చింది. పదోన్నతి షెడ్యూల్ ప్రకారం ఆన్‌లైన్‌లో కౌన్సెలింగ్ జరగాల్సి ఉండగా జిల్లా విద్యాశాఖ సౌలభ్యం మేరకు ఆఫ్‌లైన్‌లో నిర్వహించేకోవచ్చని పాఠశాల కమిషనరేట్ నుంచి వచ్చిన ఆదేశాలను పాటించారు. ఈ నేపథ్యంలో ఎట్టకేలకు సాయంత్రం 47 ఖాళీ హెచ్‌ఎం పోస్టులకు ముందుగా ప్రకటించిన సీనియార్టీ జాబితాను అనుసరించి కౌన్సెలింగ్ నిర్వహించి పోస్టులను కేటాయించారు. వీటితో పాటు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఖాళీగా ఉన్న మరో పోస్టుకు కౌన్సెలింగ్ ద్వారా కేటాయించారు.

69 మంది హెచ్‌ఎంలకు స్థాన చలనం

బదిలీ కోసం 100 మంది ప్రధానోపాధ్యాయులు దరఖాస్తు చేసుకోగా వారిలో 26 మంది తప్పనిసరి బదిలీ అవ్వాల్సిన వారుగా ఉన్నారు. మిలిగిలిన 74 మంది నచ్చిన స్థానాలు వస్తే బదిలీ అవ్వాలని చూశారు. అయితే వారిలో 43 మంది మాత్రమే ఆ అవకాశాన్ని సద్వినియోగం చేసుకున్నారు. దీంతో మొత్తం 69 మంది హెచ్‌ఎంలకు స్థానచలనం కలిగింది.

నేడు ఎల్‌ఎఫ్‌ఎం హెచ్‌ఎం కేటాయింపులు

బదిలీ షెడ్యూల్ ప్రకారం ఇప్పటికే ఆప్షన్స్ గడువు ముగిసిన ఎల్‌ఎఫ్‌హెచ్‌ఎం (పీఎస్‌హెచ్‌ఎం) బదిలీ స్థానాల కేటాయింపు ప్రక్రియ శుక్రవారం ఆన్‌లైన్‌లో జరుగుతుంది. దరఖాస్తు చేసుకున్న 125 మంది పీఎస్‌హెచ్‌ఎంలలో తప్పనిసరి బదిలీలు అవ్వాల్సిన వారు 83 మంది ఉన్నారు. వీరిలో ఎనిమిదేళ్ల సర్వీసు పూర్తిచేసుకున్నవారు ఐదుగురు, మిగులు పీఎస్‌హెచ్‌ఎంలుగా 78 మంది వరకు ఉన్నారు. మిగిలిన వారంతా బదిలీలను కోరుకుంటున్నారు. మరో వైపు స్కూల్ అసిస్టెంట్ టీచర్ల ఖాళీలను గురువారం విద్యాశాఖ ప్రకటించి బదిలీ ఆప్షన్స్‌ను శుక్రవారం నుంచి ఆన్‌లైన్‌లో స్వీకరిస్తుంది.

ముగిసిన బదిలీ దరఖాస్తుల స్వీకరణ

ప్రభుత్వ ఉద్యోగుల బదిలీ షెడ్యూల్ మేరకు దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ గురువారంతో ముగిసింది. ఈ నెల మూడోవారం చివరల్లో ప్రభుత్వ ప్రకటించిన బదిలీ నిషేధం ఎత్తివేత జీఓ ప్రకారం బదిలీల ప్రక్రియను వివిధ శాఖలు చేపట్టాయి. ప్రభుత్వ శాఖల వారీగా చేపడుతున్న బదిలీ ప్రక్రియలో భాగంగా దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ గడువు ముగిసింది. వచ్చే నెల 2వ తేదీలోగా నిబంధనల మేరకు ఉద్యోగులకు స్థానచలన అవకాశాన్ని కలిగించాలి. జూన్ 3న బదిలీ నిషేధపు ఉత్తర్వులు వెలువడతాయి.

దొరికిన దొంగల ముఠా



పట్టుబడిన నిందితుల వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ రాఘవులు



- చోరీకి ప్రధాన సూత్రధారి టీడీపీ కార్యకర్త సూర్యారావు
- ఆయన సూచనలతోనే చోరీ ప్రణాళిక
- చోరీలో పాల్గొన్న పదిమందిలో 8 మందిని పట్టుకున్న పోలీసులు
- మిగిలిన ఇద్దరి కోసం గాలింపు
- 5 తులాల బంగారం రికవరీ
- నిందితుల సెల్ ఫోన్లు, కారు స్వాధీనం
- గతంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో పలు చోట్ల చోరీకి పాల్పడిన ముఠా
- వివరాలు వెల్లడించిన డీఎస్పీ రాఘవులు



చోరీ కోసం దుండగులు వినియోగించిన కారు

చీపురుపల్లి: చీపురుపల్లి మెయిన్ రోడ్డులో, పోలీస్ స్టేషన్‌కు కూతవేటు దూరంలోని ఓ ఇంటిలో చొరబడి.. ఇద్దరు వృద్ధులను గాయపరిచి చోరీకి పాల్పడిన దొంగల ముఠాను పోలీసులు పట్టుకున్నారు. మొత్తం పది మందిలో 8 మంది అరెస్టు కాగా, మిగిలిన ఇద్దరి కోసం పోలీసులు గాలిస్తున్నారు. ఘటన వివరాలను చీపురుపల్లి పోలీస్‌స్టేషన్ వద్ద గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డీఎస్పీ ఎస్.రాఘవులు వెల్లడించారు. ఎలాంటి కష్టం లేకుండా రూ.వందల కోట్లు కొల్లగొట్టాలనే అత్యాశతో ఈ నెల 23న అర్ధరాత్రి దాటిన తరువాత పట్టణంలోని మెయిన్‌రోడ్‌లోని వారణాశి సురేష్ నివాసంలో చోరీకు పాల్పడ్డారు. వీరికి ఆ స్థాయిలో డబ్బు, బంగారం దొరకలేదు. వృద్ధులను గాయపరిచి వారి మెడలోని బంగారు ఆభరణాలు దోచుకుపోయారు. ఈ దొంగల ముఠా ఇక్కడ మాత్రమే కాదు గతంలో జరిపిన చోరీల్లో సైతం విఫలయత్నమే చేశారు తప్ప ఎక్కడా చోరీలు సఫలీకృతమవ్వలేదు. చీపురుపల్లిలో చోరీ ఘటనకు ప్రధాన సూత్రధారి మండలంలోని గత్సలవలస గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్త మన్నెల సూర్యారావు. గ్రామంలో టీడీపీ ప్రధాన కార్యకర్తగా చలామణిలో ఉన్నాడు. 2024 అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీ తరఫున క్రియాశీలకంగా పనిచేసినట్టు గ్రామస్తులు చెబుతున్నారు.

వీడియోలు, ఫొటోలు టీడీపీ కార్యకర్త ద్వారానే...

సూర్యారావు ఇచ్చిన సమాచారంతోనే ముఠా చోరీకు పాల్పడినట్లు డీఎస్పీ రాఘవులు వెల్లడించారు. చోరీ జరిగిన ఇంటిలో రూ.300 కోట్లు వరకు నగదు, 350 కేజీల వరకు బంగారం లభిస్తుందని పార్వతీపురం మన్యం జిల్లాలో కూనేరులో ఉన్న ఆశిస్ జగం అలియాస్ జగన్ అనే వ్యక్తికి సూర్యారావు సమాచారం అందించాడు. ఆ ఇంటికి సంబంధించిన ఫొటోలు, వీడియోలు తీసి పంపించాడు. దానిని జగన్ తిరిగి విజయనగరంలోని సావిత్రి అలియాస్ జ్యోతి అనే మహిళకు పంపించాడు. ఆమె శ్రీకాకుళం జిల్లాలోని దేవరాపల్లిలో ఉన్న ఆచంట వెంకటేష్‌కు పంపించింది. వెంకటేష్ నుంచి విజయనగరంలోని బొల్లవరపు నాగరాజుకు సమాచారం చేరింది. అదే వెంకటేష్ బాపట్లలోని నాజుల్ బాబు అలియాస్ డైమండ్ బాబు అనే కీలక నిందితునికి సమాచారం ఇచ్చారు. ఆయన నుంచి వంగర శ్రీనివాసరావు, శ్యామ్‌కుమార్‌లకు సమాచారం ఇచ్చారు. ఇలా మొత్తం పది మంది కలిసి చోరీకు ప్రణాళిక రచించారు. వీరిలో పట్టుబడిన 8 మంది నుంచి 5 తులాలు బంగారం, ఎనిమిది సెల్‌ఫోన్లు, ఒక కారును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అయితే, చోరీలో ఇద్దరు వృద్ధులను గాయపరిచి వారి నుంచి పదిహేడున్నర తులాల బంగారం అపహరించుకుపోయినట్లు వారణాశి కస్తూరి, వైశ్యరాజు చిట్టెమ్మల కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేసిన నేపథ్యంలో పోలీసులు మాత్రం దుండగలు నుంచి కేవలం 5 తులాల బంగారం మాత్రమే స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు.



నిందితులు నుంచి స్వాధీనం చేసుకున్న బంగారం, మొబైల్ ఫోన్లు

పోలీసుల పనితీరు భేష్

చోరీ జరిగిన కొద్ది గంటల్లోనే నిందితులను పట్టుకోవడంలో సర్కిల్ ఇన్స్‌పెక్టర్ జి.శంకరరావు, ఎస్‌ఐ ఎల్.దామోదరరావు ఆధ్వర్యంలో పోలీస్ సిబ్బంది చూపిన చొరవ అభినందనీయమని డీఎస్పీ ఎస్.రాఘవులు అన్నారు. 23న చోరీ జరగగా, 24న రాత్రి నిందితులను గుర్తించామని, విచారణ నిర్వహించిన అనంతరం బుధవారం సాయంత్రం జిల్లా కేంద్రంలోని దుండగులను అరెస్టు చేసినట్లు చెప్పారు. పోలీస్ సిబ్బందికి రివార్డులు కోసం ప్రతిపాదిస్తామని స్పష్టం చేసారు.

చోరీ కేసులో అదుపులోకి తీసుకున్నది వీరినే...

నాజుల్ బాబు అలియాస్ డైమండ్ బాబు అలియాస్ వజ్రాల బాబు, కుమ్మరిగుంట శ్యామ్‌కుమార్, వంగర శ్రీనివాసరావు, ఆచంట వెంకటేష్, బొల్లవరపు నాగరాజు, దాసు సావిత్రి అలియాస్ జ్యోతి, ఆశిస్ జగం అలియాస్ జగన్, మన్నెల సూర్యారావు. తేల్లి కిషోర్, మనోజ్‌లు దొరకాల్సి ఉంది. వీరిపై 310(2), 310(5), 311, 331(8) సెక్షన్ల కింద కేసులు నమోదు చేసినట్లు డీఎస్పీ తెలిపారు.

క్లుప్తంగా

కొఠియా సమస్యల పరిష్కారంపై చొరవ చూపాలి



- రాష్ట్ర ఎస్టీ కమిషన్ ఛైర్మన్ డాక్టర్ డీవీజీశంకరరావు

విజయనగరం అర్బన్: సుదీర్ఘకాలంగా అపరిష్కృతంగా ఉన్న కొఠియా గ్రామాల వివాదాన్ని పరిష్కంచేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చొరవ చూపాలని రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ డాక్టర్ డీవీజీశంకరరావు కోరారు. ఇటు ఆంధ్రప్రదేశ్‌లో ఎన్‌డీఏ కూటమి అధికారంలో ఉండడం, అటు ఒడిశా బీజేసీ పాలిత రాష్ట్రంగా ఉన్న నేపథ్యంలో కొఠియా గ్రామ సమస్య పరిష్కరానికి ఇదే తగిన సమయమని డాక్టర్ శంకరరావు పేర్కొన్నారు. గతంలో సుప్రీంకోర్టు కూడా ఈ సమస్యకు రాజకీయ, పరిపాలనా పరమైన పరిష్కారాలు చూడాల్సిన అవసరం ఉందని చెప్పిందని సూచించారు. ఆయా గ్రామాల ప్రజాభిప్రాయానికి విలువనిస్తూ వారి సంక్షేమం, అభివృద్ధికి ఆటంకం కలగకుండా సమస్య పరిష్కరించాల్సి ఉందన్నారు. ఈ మేరకు కేంద్ర గిరిజన శాఖకు, రాష్ట్ర ప్రభుత్వానికి ఏపీ ఎస్టీ కమిషన్ లేఖ రాసినట్లు తెలిపారు. కొఠియా సమస్య పరిష్కారానికి కేంద్రం సారథ్యంలో కమిటీ వేయాలని ఆంధ్ర, ఒడిశా ప్రభుత్వాలు కొఠియా గ్రామాల సమస్య పరిష్కారానికి తమ వంతు సహకారం అందించాలని కోరారు.

ఈవీఎం గొడౌన్ల తనిఖీ



ఈవీఎం గోదామును తనిఖీచేస్తున్న కలెక్టర్ అంబేద్కర్

నెల్లిమర్ల: స్థానిక ఈవీఎం గొడౌన్లను కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేద్కర్ గురువారం తనిఖీ చేశారు. గోదాములకు వేసిన సీళ్లను, తాళాలను పరిశీలించి సెక్యూరిటీపై సమీక్షించారు.అప్రమత్తంగా ఉండాలని అధికారులు, పోలీసు సిబ్బందిని ఆదేశించారు. ఇన్‌చార్జ్ ఆర్డీఓ టి.సవరమ్మ, తహసీల్దార్ రవిశంకర్, కలెక్టరేట్ ఇన్‌చార్జ్ సూపరింటెండెంట్ శేఖర్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

జర్నలిస్టుల అక్రిడేషన్ కార్డుల కాలపరిమితి పొడిగింపు

విజయనగరం అర్బన్: రాష్ట్రంలోని జర్నలిస్టుల అక్రిడేషన్ కార్డుల గడువు మరో మూడు నెలల పాటు పొడిగిస్తూ సమాచార పౌర సంబంధాల శాఖ సంచాలకుడు హిమాన్షు శుక్ల గురువారం ఉత్తర్వులు జారీచేశారని జిల్లా సమాచార పౌరసంబంధాల అధికారి తెలిపారు. ఉత్తర్వుల మేరకు 2025 జూన్ 1 నుంచి 2025 ఆగస్టు 31 వరకు పొడిగింపు వర్తిస్తుందన్నారు.

31న జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సమావేశం

పార్వతీపురంటౌన్: జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సమావేశం ఈ నెల 31న కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో ఉదయం 11 గంటలకు జరుగుతుందని కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ తెలిపారు. ఈ మేరకు గురువారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. జిల్లా విజిలెన్స్ మానిటరింట్ కమిటీ సమావేశంలో షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగల(అత్యాచారాల నివారణ) చట్టం, 1989, నియమాలు, 1995 సమీక్షకు హాజరు కావడానికి కావాల్సిన సమాచారం మొత్తం నివేదిక రూపంలో సమర్పించాలని అధికారులను ఆదేశించారు. జిల్లా విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ నూతన సభ్యులను ఎన్నుకోనున్నట్లు పేర్కొన్నారు.

శిథిలావస్థలో కుష్ఠు ఆస్పత్రి

- భయాందోళనలో రోగులు
- వసతిలేక ఇబ్బందులు



వసతులులేని పాగిరి లెప్రసీ ఆస్పత్రి

రాజాం: ఉమ్మడి విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల్లో చాలామందికి పాగిరి లెప్రసీ ఆస్పత్రి పేరు తెలిసే ఉంటుంది. విశాఖపట్నం పరిధిలో కేవలం మూడుచోట్ల మాత్రమే స్వాతంత్ర్యం వచ్చిన తొలినాళ్లలో లెప్రసీ నిర్మూలన ఆస్పత్రులు ఉండేవి. అందులో పాగిరిలో ఒకటి నిర్మించి, సేవలు ప్రారంభించారు. 1962లో ఎంతో అట్టహాసంగా నాలుగు భవనాలతో లెప్రసీ ఆస్పత్రి ఇక్కడ ప్రారంభమైంది. అప్పటినుంచి ఇప్పటివరకూ అవే భవనాల్లో ఇక్కడ రోగులకు సేవలు అందిస్తున్నారు. స్థలాలు, నిధులు ఉన్నా పక్కా భవనాల నిర్మాణం ఇక్కడ లేక పోవడంతో రోగులకు ఇబ్బందులు తప్పడం దు.

పట్టించుకునేవారేరీ?

రాష్ట్రప్రభుత్వం ప్రజారోగ్యంపై దృష్టిసారించడం లేదు. కుష్ఠు నిర్మూలన కార్యక్రమాల ప్రారంభం అట్టహాసమే తప్ప వచ్చి తమ రోగాన్ని నిర్మూలించుకోవాలనుకునేవారికి కనీస వసతులు కల్పించలేకపోతున్నారు. రాజాంతో పాటు రేగిడి, వంగర, సంతకవిటి, జి.సిగడాం, పొందూరు, తెర్లాం తదితర ప్రాంతాల్లోని రోగులకు పాగిరి లెప్రసీ ఆస్పత్రి ఆసరాగా ఉంటుంది. ప్రతి నెలా సగటున 20 నుంచి 28 మంది రోగులు ఇక్కడికి వచ్చి ఉంటున్నారు. వ్యాధి తగ్గినవారు ఇంటికి వెళ్లిపోతుండగా, కొత్తవారు వచ్చి నయం చేసుకుంటున్నారు. వారికి కనీసం ఇక్కడ భోజనం పెట్టే సదుపాయాన్ని కూడా ప్రభుత్వం కల్పించలేదు. రాజాంకు చెందిన పారిశ్రామికవేత్త జీఎంఆర్ ఆర్థిక సాయంతో పాటు కొంతమంది దాతలు అప్పుడప్పుడు ఇక్కడికి వచ్చి ఆర్థికసాయాన్ని అందిస్తున్నారు. తాగునీటి సమస్యతో పాటు వసతి సమస్యతో ఇబ్బందులు పడుతున్నామని, కనీసం దుప్పట్లు, రగ్గులు వంటివి కూడా ఇక్కడ పంపిణీ లేదని పలువురు బాధితులు వాపోతున్నారు.

చినుకుపడితే చిత్తడే

ఎప్పుడో 62 సంవత్సరాల క్రితం నిర్మించిన రేకులు, పెంకుల భవనాలే ఇప్పటికీ ఆస్పత్రి భవనాలుగా ఉన్నాయి. వాటి రేకులు శిథిలమై నీరు కారుతోంది. ఎండాకాలంలో నేరుగా ఎండ లోపలకు వచ్చేస్తుంది. విషసర్పాలు, దోమలు నేరుగా భవనాల్లోకి వస్తున్నాయి. చలికాలం, వర్షాకాలంలో ఇక్కడ రక్షణలేని పరిస్థితి కనిపిస్తోంది. కిటికీల తలుపులు, ప్రధాన ద్వారబంధాల తలుపులు మొత్తం ఊడిపోయాయి. వాటికి స్థానిక వైద్యులు సొంత డబ్బులతో మరమ్మతులు జరిపిస్తున్నారు. రాజాంకు చెందిన జీఎంఆర్ వీఎఫ్ చిన్నచిన్న మరమ్మతులకు ఆర్థికసాయం అందిస్తోంది. కొత్తగా ఇక్కడ భవనాలు అవసరమున్నప్పటికీ రోగుల సంఖ్య తగ్గడంతో పెద్దగా దృష్టిసారించ లేదు.

భోజన సదుపాయం లేదు

మేం చిన్నచిన్న కుష్ఠు వ్యాధి లక్షణాలతో ఇక్కడ చేరాం. ప్రస్తుతం వ్యాధి తగ్గుముఖం పడుతోంది. ఇంటి వద్ద కుటుంబసభ్యులు వచ్చేయమన్నారు. కానీ మరికొద్ది రోజులు ఉండి వెళ్లాలని అనుకుంటున్నాను. ఇక్కడ సరైన భవనాలు లేవు. దోమలు. విష సర్పాల బెడద ఉంటుంది. భోజనాలు దాతలు సమకూర్చు తున్నారు.

కె.రాంబాబు, కుష్ఠువ్యాధి బాధితుడు

కొత్త వాటి పంపిణీలేదు

ఇక్కడ ఆస్పత్రిలో ఎప్పటివో పాతకాలంనాటి దుప్పట్లు, బెడ్‌షీట్లు ఉన్నాయి. సరైన వస్తుసామగ్రి లేదు. కొత్తవి పంపిణీ చేయడంలేదు. దాతలు ఇచ్చిన రగ్గులు, దుప్పట్లు తప్ప కొత్తవి ప్రభుత్వం నుంచి సరఫరాలేదు.

పి.లక్ష్మణరావు, కుష్ఠువ్యాధి బాధితుడు



ఆస్పత్రిలో పాత మంచాలు, బెడ్‌షీట్లు



శిథిల భవనంలో చికిత్స పొందుతున్న రోగులు



కేంద్రం ప్రారంభంనాటి రేకులషెడ్డు

జిల్లాలో బాలకార్మికులు పనిచేయకుండా చూడాలి

- కలెక్టర్ బీఆర్ అంబేద్కర్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ అంబేద్కర్

విజయనగరం ఫోర్ట్: జిల్లాలో బాలకార్మికులు పనిచేయకుండా చూడాలని కలెక్టర్ బీఆర్ అంబేద్కర్ అన్నారు. జూన్ 2 నుంచి 30 వరకు రాష్ట్రవ్యాప్తంగా బాలకార్మికుల పునరావాసం కోసం ప్రత్యేక డ్రైవ్ చేపడుతున్నట్లు తెలిపారు. అందుకోసం జిల్లా స్థాయి. డివిజనల్ స్థాయిలో ఏర్పాటు చేసిన టాస్క్‌ఫోర్స్ సభ్యులు జిల్లా అంతటా ఒకే సమయంలో దాడులు చేయాలని ఆదేశించారు. ఈ మేరకు గురువారం ఆయన తన చాంబర్‌లో జిల్లా టాస్క్ ఫోర్స్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ముందు ప్రమాదకరమైన సంస్థలు, స్థలాల్లో పనిచేస్తున్న బాల కార్మికులను రెండు రోజుల్లోగా గుర్తించాలని సూచించారు. ఎక్కడైనా బాల కార్మికులను గుర్తిస్తే వెంటనే పనిచేయించే యాజమానిపై ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని స్పష్టం చేశారు. నెలరోజుల పాటు జిల్లా అంతటా టాస్క్ ఫోర్స్ కమిటీలు ఒకే సమయంలో దాడులు జరపాలని ఆదేశించారు. సమావేశంలో డీఆర్‌ఓ మురళి, డిప్యూటీ కమిషనర్ ఆఫ్ లేబర్ ప్రసాదరావు, ఐసీడీఎస్ పీడీ రుక్సానా బేగం, జిల్లా బాలల సంక్షేమ కమిటీ చైర్‌పర్సన్ హిమబిందు, డీసీపీయూ లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

69 డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు

- రూ.6.90 లక్షల జరిమానా వసూలు



డ్రంక్ అండ్ డ్రైవ్ కేసుల వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ వకుల్ జిందల్

విజయనగరం క్రైమ్: విజయనగరం పోలీసులు గురువారం నిర్వహించిన డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీల్లో రూ.6.90 లక్షల జరిమానా వసూలు చేశారు. మొత్తం 69 డ్రంక్ అండ్ డ్రైవ్ కేసుల్లో బాధ్యులను కోర్టులో ప్రవేశపెట్టారు. మద్యం తాగి వాహనాలు నడిపి పట్టుబడిన వాహనదారులకు ఒక్కొక్కరికి రూ.10వేలు జరిమానాను విజయనగరం అడిషనల్ జుడిషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ చక్రవర్తి విధించారని ఎస్పీ వకుల్ జిందల్ తెలిపారు. మద్యం మత్తులో వాహనాలు నడిపితే ప్రమాదాలకు గురవుతారని ఎస్పీ ఈ సందర్భంగా చెప్పారు. అలాగే వాహనాలను ఢీకొట్టి పలు ప్రమాదాలకు కారకులవుతున్నారన్నారు. ఈ తరహా బైక్ రైడ్స్‌ను కట్టడి చేసి, ప్రమాదాలను నివారించేందుకు ప్రత్యేకించి విజువల్ పోలీసింగ్ చేపడుతున్నామన్నారు. విజువల్ పోలీసింగ్‌లో ముఖ్యంగా డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలను తమ సిబ్బంది చేపడుతున్నారని ఎస్పీ ఈ సందర్భంగా తెలిపారు.

హక్కుల పట్ల గిరిజనులకు అవగాహన ఉండాలి



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి డా. ఎ.కృష్ణప్రసాద్

పార్వతీపురంటౌన్: గిరిజనులకు వారి హక్కులు, బాధ్యతల పట్ల అవగాహన కలిగి ఉండాలని విజయనగరం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి డా. ఎ. కృష్ణప్రసాద్ అన్నారు. ఈ మేరకు గురువారం జిల్లా కోర్టు ఆవరణలో నిర్వహించిన న్యాయవిజ్ఞాన సదస్సులో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం గిరిజనుల సంక్షేమం కోసం అమలు చేస్తున్న పలు పథకాలపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. నాగరిక సమాజానికి దూరంగా ఉంటున్న గిరిజనులకు రాజ్యాంగం ద్వారా ప్రత్యేక హక్కులు కల్పించినట్లు తెలిపారు. గిరిజన హక్కులు పరిరక్షించేందుకు ప్రభుత్వం కృషి చేస్తున్నట్లు చెప్పారు.

సబ్‌జైల్ ఆకస్మిక తనిఖీ

పార్వతీపురం సబ్ జైలును గురువారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. జైలులో ఖైదీలతో ముఖాముఖి మాట్లాడి వసతులు పరిశీలించారు. నాణ్యమైన ఆహారం అందుతోందా? లేదా? అని ఖైదీలను అడిగి తెలుసుకున్నారు. నిబంధనల ప్రకారం నడుచుకోవాలని జైలు సిబ్బందిని ఆదేశించారు. అనంతరం జైలు రికార్డులు పరిశీలించి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో అదనపు జూనియర్ సివిల్ జడ్జి జె.సౌమ్య జోస్పిన్, డీఆర్‌డీఏ ఏపీడీ సత్యంనాయుడు, లోక్ అదాలత్ సభ్యులు టి.జోగారావు, ఎంఎల్ఎస్సీ సిబ్బంది కె. సునీత, జి.గంగాదేవి, పారాలీగల్ వలంటీర్లు, గిరిజనులు పాల్గొన్నారు.

రైలు కింద పడి ఒడిశా వాసి మృతి


దత్తిరాజేరు: మండలంలోని పెదమానాపురం రైల్వేగేట్ సమీపంలో రైలు కింద పడి గురువారం ఉదయం ఒడిశా వాసి మృతి చెందినట్లు బొబ్బిలి రైల్వే కానిస్టేబుల్ ఈశ్వరరావు తెలిపారు. ఒడిశాలోని కలహండి జిల్లా జమున్ బహల్ తాలూకా, దాదాపూర్ గ్రామానికి చెందిన జవహర్‌లాల్ బిశ్వాల్(45)ను వైజాగ్ నుంచి బొబ్బిలి వైపు వెళ్తున్న రైలు ఢీకొనడంతో మృతి చెందినట్లు చెప్పారు. దీనిపై మృతుడి కుటుంబసభ్యులకు సమాచారం అందించి మృతదేహాన్ని విజయనగరం సర్వజన ఆస్పత్రిలో ఉంచినట్లు తెలిపారు.

బడ్డీకొట్టు మాయం..!

- పేదవ్యాపారి కొట్టును లేపేసిన బడావ్యాపారి
- పోలీస్‌స్టేషన్‌లో బాధితుడి ఫిర్యాదు
- నాన్చుడు ధోరణిలో పోలీసులు



బడ్డీకొట్టు మాయమైన ప్రాంతం



రోడ్డున పడిన చిరువ్యాపారి ప్రసాద్



రంగప్పచెరువులో పడేసిన బడ్డీకొట్టు

రాజాం: ఓ పేద వ్యాపారి బడ్డీకొట్టుపై బడా వ్యాపారి కన్నుపడింది. అంతే..అదే తడవుగిగా అధికారపార్టీ నాయకులను ఆశ్రయించి రాత్రికి రాత్రే చెక్క బడ్డీని అపహరించి, చెరువులో పడవేంచాడు ఆ బడా వ్యాపారి. ఈ తంతు జరిగిన వెంటనే బాధితుడు రాజాం పట్టణ పోలీసులకు ఫిర్యాదుచేసి నాలుగురోజులు గడిచినా బాధితుడికి న్యాయం జరగలేదు. కేవలం అధికార పార్టీ ఒత్తిళ్లతోనే తనకు అన్యాయం జరుగుతోందని బాధితుడు వాపోతున్నాడు. ఆ వివరాలు ఇలా ఉన్నాయి. రాజాం పట్టణంలోని మాధవబజార్‌లో ప్రభుత్వ పాఠశాల ఎదురుగా పట్టణానికి చెందిన వడ్డి ప్రసాద్ అనే చిరువ్యాపారి గత 30 సంవత్సరాలుగా చెక్క బడ్డీ కొట్టులో ఉల్లిపాయలు, చింతపండు, కూరగాయలు విక్రయిస్తూ జీవనం సాగిస్తున్నాడు. రోజువారీ వ్యాపారంపై వస్తున్న ఆదాయంతో తనతో పాటు భార్యను పోషిస్తూ వస్తున్నాడు. ఈయన బడ్డీకొట్టు వెనుకల బండి లక్ష్మీనారాయణకు చెందిన కిరాణా వ్యాపారికి చెందిన పక్కా షాపు ఉంది. ఆ షాపుకు ఈ చిన్న బడ్డీ కొట్టు అడ్డుగా ఉండడంతో వారిద్దరి మధ్య కొంతకాలంగా వివాదాలు వస్తున్నాయి. కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత లక్ష్మీనారాయణ వేధింపులు ఎక్కువయ్యాయి. తన బడ్డీకొట్టు లీజుకు తీసుకున్న దస్తావేజులు, రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్లు ఉండడంతో ప్రసాద్ ఎవరికీ లొంగలేదు. తన వ్యాపారం తాను చేసుకుంటూ కాలంనెట్టుకొస్తున్నాడు. ఈ నేపథ్యంలో ఈనెల 25 న అర్ధరాత్రి సమయంలో ప్రసాద్‌కు చెందిన బడ్డీ మాయమైంది. మరుసటిరోజు ఉదయం వ్యాపారం చేసేందుకు వచ్చిన ప్రసాద్ తన బడ్డీ అక్కడ లేకపోవడంతో ఉలిక్కిపడ్డాడు. తన బడ్డీ కొట్టు ఎవరో దొంగిలించారని తొలుత ఆందోళన చెందాడు. అనంతరం శ్యాంపురం రోడ్డులో రంగప్ప చెరువులో బడ్డీకొట్టు పడేసి ఉండడంతో తనతో వివాదాలకు దిగుతున్నవారే ఈ పనిచేసిఉంటారని బాధితుడు అనుమానం వ్యక్తంచేస్తూ తన బడ్డీకొట్టు వెనుక ఉన్న వ్యాపారిపై రాజాం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదుచేశాడు.

నాలుగు రోజులైనా జరగని న్యాయం

తన వద్ద అన్నిరకాల డాక్యుమెంట్లు ఉన్నాయని, తన బడ్డీని దొంగిలించినవారిపై చర్యలు తీసుకోవడంతో పాటు అందులో రూ.1 లక్షకుపైగా ఉన్న సరుకులకు డబ్బులు ఇప్పించాలని పోలీసులను కోరాడు. ఈ తంతు జరిగిన నాలుగురోజులు గడిచినా ఇంతవరకూ ప్రసాద్‌కు న్యాయం జరగలేదు. తాను చిరువ్యాపారిని కావడంతోనే తనకు ఎవరూ మద్దతుగా రావడంలేదని, న్యాయం జరగడంలేదని ప్రసాద్ విలేకరుల ఎదుటవాపోతున్నాడు. బండి లక్ష్మీనారాయణ అనే బడా వ్యాపారే కొంతమంది అధికార పార్టీ నేతల మద్దతుతో బలవంతంగా తన బడ్డీ కొట్టూ తొలగించాడని ఆరోపిస్తున్నాడు. పోలీసులు సైతం తనకు న్యాయం చేయడంలేదని లబోదిబోమంటున్నాడు. ఇదిలా ఉండగా ఈ విషయంపై రాజాం పట్టణ సీఐ అశోక్‌కుమార్ వద్ద సాక్షి ప్రస్తావించగా, బాధితుడి ఫిర్యాదుమేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామని, న్యాయం చేస్తామన్నారు.

యోగాతో జీవనాడులు ఉత్తేజం

- డీఎంహెచ్‌ఓ భాస్కర రావు



యోగాంధ్ర కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డా ఎస్.భాస్కరరావు

పార్వతీపురం టౌన్: యోగాసనాలతో మానవ జీవ నాడులు ఉత్తేజమవుతాయని పార్వతీపురం మన్యం జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డా.ఎస్.భాస్కరరావు అన్నారు. ఈ మేరకు గురువారం స్థానిక వైద్యారోగ్య కార్యాలయం వద్ద అంగన్వాడీ కార్యకర్తలు, వైద్యసిబ్బందికి యోగాసనాలపై యోగా గురువు మోహన్ శిక్షణ ఇచ్చారు. ప్రాణాయామంతో పాటు వివిధ భంగిమల యోగాసనాలను వేయించారు. ఈ సందర్భంగా జిల్లా వైద్య, ఆరోగ్య అధికారి మాట్లాడుతూ కలెక్టర్ ఆదేశాల మేరకు ప్రతి ఒక్కరూ యోగాసనాలు అలవర్చుకునే విధంగా యోగా గురువుతో శిక్షణ అందిస్తున్నట్లు తెలిపారు. ప్రస్తుత రోజుల్లో మానసిక ప్రశాంతత, పని ఒత్తిడిని జయించేందుకు యోగా సాధన ఎంతగానో ఉపయోగపడుతుందని చెప్పారు. అలాగే స్త్రీ శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో జిల్లాలోని కురుపాం, పాలకొండ, సాలూరులలో యోగా శిక్షణ కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా స్త్రీ శిశు సంక్షేమశాఖ పీడీ టి.కనక దుర్గ, జిల్లా ఆర్‌బీఎస్‌కే కోఆర్డినేటర్ డా. టి.జగన్నాథ రావు, ఐసీడీఎస్ పీఓలు బి.శ్రీనివాసరావు, జి. సుగుణ కుమారి, ఎస్.సుక్కా తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయాలతోనే బాలల వికాసం



విజేతలకు పుస్తకాలు అందజేస్తున్న దృశ్యం

విజయనగరం: గ్రంథాలయాలు బాలల వికాసానికి తోడ్పడతాయని విజయనగరం జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి బి.లక్ష్మి పేర్కొన్నారు. ఈ మేరకు ఆంధ్రప్రదేశ్ గ్రంథాలయ సంఘం ఆధ్వర్యంలో గురువారం జరిగిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ బాల్యం నుంచే పుస్తక పఠనం అలవాటు చేయాలని సూచించారు. ఆంధ్రప్రదేశ్ గ్రంథాలయ సంఘం విజయనగరం జిల్లా అధ్యక్షుడు సముద్రాల గురుప్రసాద్ మాట్లాడుతూ ప్రతి పంచాయతీ స్థాయిలోనూ విద్యార్థులకు అందుబాటులో గ్రంథాలయం ఉండాలన్నారు. పిల్లలను కూర్చోబెట్టి పైకి వినిపించేలా పుస్తక పఠనం చేయిస్తే భాషా ఉచ్చారణ, పఠన సామర్థ్యం కమ్యూనికేషన్ స్కిల్స్ పెరుగుతాయని ఈ విషయంపై తల్లిదండ్రులు తప్పనిసరిగా శ్రద్ధ పెట్టాలని సూచించారు. కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన క్విజ్ పోటీల్లో ఆసక్తిగా పాల్గొని భారతదేశ చరిత్రతో పాటు, జిల్లా స్థాయి అంశాలపైన విద్యార్థులు ఎంతో హుషారుగా సమాధానాలు చెప్పారు. విజేతలకు పుస్తకాలను, పతకాలను అందజేశారు. కార్యక్రమంలో మేకా అనంతలక్ష్మి చారిటబుల్ ట్రస్టు వ్యవస్థాపకురాలు అనంతలక్ష్మి, ఏపీ గ్రంథాలయ సంఘం విజయనగరం జిల్లా శాఖ కార్యదర్శి సుభద్రా దేవి, మహిళా విభాగం అధ్యక్షురాలు పిన్నింటి కళావతి, సంఘం సలహాదారు కంచర్ల రాజేశ్వరరావు, అసిస్టెంట్ లైబ్రేరియన్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

టవర్ల పూర్తి చేయాలి

- కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్

పార్వతీపురంటౌన్: పార్వతీపురం మన్యం జిల్లాలో అసంపూర్తిగా ఉన్న మొబైల్ టవర్ల పనులను తక్షణమే పూర్తి చేయాలని కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ ఆదేశించారు. మొబైల్ టవర్లు, గృహ నిర్మాణం పట్టాలపై గురువారం స్థానిక కలెక్టరేట్‌లో సంబంధింత అధికారులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం మొబైల్ టవర్ల నిర్మాణానికి అధిక ప్రాధాన్యం ఇస్తోందని, జిల్లాలో ఇంకా 16 మొబైల్ టవర్ల నిర్మాణం పూర్తి కావాల్సి ఉందన్నారు. గుమలక్ష్మీపురం మండలం వడబాయి, కొమరాడ మండలం ఊటకోసు, వనబడి, సాలూరు మండలం సూరపాడు, చోర గ్రామాల వద్ద రహదారుల నిర్మాణానికి పరిపాలన అనుమతులు జారీ చేశామని వాటిని త్వరితగతిన పూర్తి చేసి మొబైల్ టవర్ల నిర్మాణం వేగవతం కావడానికి చర్యలు చేపట్టాలని ఆదేశించారు. పనులు ఆలస్యం చేస్తూ బాధ్యతారాహితంగా పని చేస్తున్న వారికి షోకాజ్ నోటీసులు జారీ చేయాలని అధికారులను ఆదేశించారు. బత్తిలి, కొమరాడ మండలం ఉలికేసు, బదిలీటీనకు, సాలూరు మండలంలోని భద్ర పనులకు తక్షణమే అంచనాలు సమర్పించాలని ఆదేశించారు. అటవీ ప్రాంతంలో ఇప్పటికే నిర్మాణంలో ఉన్న గృహాలకు అటవీ అనుమతులు జారీచేసేందుకు నిబంధనలు పరిశీలించాలని అటవీ అనుమతుల జిల్లా స్థాయి కమిటీతో ఇందులో భాగంగా చర్చించామని తెలిపారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఎస్ఎస్ శోభిక, ఐటీడీఏ పీఓ అశుతోష్ శ్రీవాస్తవ, సీతంపేట ఐటీడీఏ పీఓ యశ్వంత్ కుమార్ రెడ్డి, డీఆర్‌ఓ కె. హేమలత, డ్వామాపీడీ కె. రామచంద్రరావు, తదితరులు పాల్గొన్నారు.

గురుదేవాలో చోరీపై ముమ్మరంగా దర్యాప్తు




ట్రస్టు కార్యాలయంలో సీసీటీవీ ఫుటేజీలను పరిశీలిస్తున్న ఎస్.కోట సీఐ నారాయణమూర్తి

కొత్తవలస: మండలంలోని మంగళపాలెం గ్రామంలో గల గురుదేవా చారిటబుల్ ట్రస్టు చైర్మన్ రాపర్తి జగదీష్‌బాబు ఇంట్లో భారీ చోరీ జరిగిన విషయం తెలిసిందే. ఈ చోరీ మంగళవారం రాత్రి జరిగినపటికీ పోలీసులు ఎవరికీ తెలియకుండా గోప్యంగా ఉంచారు.ఎట్టకేలకు బుధవారం రాత్రి 11 గంటలకు బాధితుడు రాపర్తి జగదీష్‌బాబు ఇచ్చిన ఫిర్యాదు మేరకు సీఐ సీహెచ్.షణ్ముఖరావు కేసు నమోదు చేశారు. ఈ చోరీలో కేవలం 90 తులాల బంగారం (కేజీ బంగారం)తో పాటు రూ.5లక్షల నగదు పోయినట్లు కేసు నమోదు చేశారు. వాస్తవానికి మూడు కేజీలకు పైగా బంగారం, రూ 20లక్షల నగదు దోచుకుపోయారని ట్రస్టు నిర్వాహకుడు చెబుతున్నారు. జగదీష్‌బాబు ఇంట్లో గల పూజ గదిలో ఆయన తాత ముత్తాతల నుంచి రాజరాజేశ్వరి శక్తి పీఠం ఏర్పాటు చేసుకుని వంశపార్యపరంగా పూజలను నిర్వహిస్తూ వస్తున్నారు. నాటి నుంచి అమ్మవారికి సంబంధించిన ఆభరణాలు వంశపార్యపరంగా వస్తున్నట్లు బాధితుడు జగదీష్‌బాబు తెలిపారు. అమ్మవారి అలంకరణలో గల బంగారుపాదాలు, వడ్డాణం,దండ కడియాలు, 108 కాసుల హారం, కొబ్బరిపువ్వులను పోలిన బంగారు గొలుసులతో పాటు అతి పురాతన రాజరాజేశ్వర ఉత్సవ విగ్రహాన్ని దోచుకుపోయినట్లు బాధితుడు తెలిపారు. ఈ ఆభరణాలు సుమారు మూడు కేజీలకు పైగానే ఉంటాయన్నారు. ఇవే కాకుండా తన తల్లి, అక్కకు సంబంధించిన బంగారు ఆభరణాలు, రూ.10 లక్షల నగదు చోరీకి గురైనట్లు తెలిపారు. చోరీకి గురైన బంగారు సామగ్రిపై జగదీష్‌బాబు పోలీసులకు సమాచారం ఇచ్చినప్పటికీ కేసు నమోదు విషయంలో పోలీసులు వెనకంజు వేశారు. బుధవారం రాత్రి 11 గంటల వరకు కేసు నమోదు చేయలేదు. కేసు నమోదు చేసిన పిమ్మట దర్యాప్తు ప్రారంభించారు. కొత్తవలస, ఎస్.కోట సీఐలు షణ్ముఖరావు, వర్రి నారాయణమూర్తిల ఆధ్వర్యంలో ఎల్.కోట, కొత్తవలస, వేపాడ, ఎస్.కోట ఎస్సైలు ముమ్మరంగా తనిఖీలు చేపట్టారు. సీసీ టీవీ ఫుటేజ్‌లను పరిశీలిస్తున్నారు. ఇప్పటికే విజయనగరం నుంచి ప్రత్యేక క్లూస్‌టీమ్ వచ్చి ఘటనా స్థలంలో వేలిముద్రలను సేకరించింది.

రెక్కీ తరువాతే చోరీ

తమ ఇంట్లో జరిగిన చోరీ అప్పటికప్పుడు చేసింది కాదని రెండు మూడు రోజుల పాటు రెక్కీ నిర్వహించి చోరీ చేసినట్లు బాధితుడు జగదీష్‌బాబు తెలిపారు.

జాతీయస్థాయి తైక్వాండో పోటీలకు బొబ్బిలి క్రీడాకారులు



విద్యార్థులను అభినందిస్తున్న సీఐ తదితరులు

బొబ్బిలి: పట్టణానికి చెందిన తైక్వాండో క్రీడాకారులు జాతీయస్థాయి పోటీలకు ఎంపికై నట్లు కోచ్ సుధాకర్ యాదవ్ తెలిపారు. స్థానికంగా శిక్షణ పొందిన 17 మంది ప్రతిభ గల క్రీడాకారులను ఒడిశా అసోసియేషన్ ఎంపిక చేసినట్లు చెప్పారు. వారు ఈనెల 30 నుంచి మూడు రోజుల పాటు కటక్‌లోని జవహర్‌లాల్ ఇండోర్ స్టేడియంలో జరగనున్న జాతీయ స్థాయి పోటీల్లో వారు పాల్గొంటారని తెలిపారు. జాతీయ స్థాయిలో తలపడుతున్న బొబ్బిలి క్రీడాకారులు గెలుపొంది పతకాలతో తిరిగి రావాలని సీఐ కె.సతీష్ కుమార్, అభ్యుదయ పాఠశాలల ప్రిన్సిపాల్ డాక్టర్ చింత శారదలు వారికి గురువారం బెస్టాఫ్ లక్ చెప్పారు.

చికెన్

బ్రాయిలర్

లైవ్	డెస్‌డ్	స్కిన్‌లెస్
₹120	₹210	₹220